# ఇల్లు "గట్టి" చూడు

– డా॥ తా. పతంజలి

శంభులింగం ఒక పెద్ద ఆఫీసులో చిన్న ఉద్యోగి. చాలా మందికి లాగానే అతనికూడా సొంతయిల్లు కట్టుకుందామని కోరిక. పాపం... ఎప్పుడూ బల్లపైనే చేతులుంచే పిచ్చివాడు. ఆఫీసులో ఎప్పుడూ చేతులు తడుపుకోలేదు. టిఫిన్ బాక్స్ తెచ్చుకొనేవాడు కాదు. తిన్న తర్వాత చేతులు కడుక్కుంటే, చేతులు తడుపుకొన్న ఫీలింగ్‌తో, లంచాలు తీసుకో బుద్దేస్తుందని.

అలాంటివాడు నానా తిప్పలు పడి, ఒక స్థలం కొనుక్కొని,రిజిస్ట్రేషన్ చేసుకొన్నాడు. స్థలం కొన్న నెల తర్వాత శంభులింగం నెలజీతాన్ని ఎవరో జేబుదొంగ "శ్రీమద్రామాయణ గోవిందో హరి" చేసాడు. ఏడ్పు మొఖంతో శంభులింగం ఇంటికి వచ్చి, కరువుతీరా ఏడ్చాడు.

ఆ తర్వాత పదిరోజుల తర్వాత శంభులింగం నెక్లెస్ ఆమె చెల్లెలు పెళ్ళికి వెళ్ళినప్పుడు పోయింది.

ఇంకేముంది. వాళ్ళ మామగారు క్లాసు పీకారు అతనికి. "ఆ స్థలం ఎప్పుడు కొన్నావ్?" నేరస్థుడిని ప్రశ్నించినట్లు శంభులింగాన్ని అడిగారు మామగారు.

"బుధవారము" అన్నాడు శంభులింగం.

'అల్లుడూ! గురు శుక్రవారాలు స్థలాలు కొనాలి. బుధవారంనాడు అమ్మాలి. అందుకే నీకు స్థలం కలిసి రాలేదు." తీర్మానించారు మామగారు.

"ఏం చేయాలంటారు?" దీనంగా అడిగాడు శంభులింగం.

"స్థలం కలిసి రాలేదు కనుక డబ్బులు, నెక్లెస్ పోయాయి. అందువల్ల పక్కనున్న స్థలాన్ని కలుపుకో" 'ఏదో చాక్లెట్ కొను' అన్నంత తేలిగ్గా చెప్పారు మామగారు.

మామగారి మాటని కాదనలేక బ్రోకర్ని ఆశ్రయించాడు శంభులింగం. పక్కనున్న స్థలమతను దానం చేస్తున్న లెవెల్లో ఉన్న ధరకంటే ఎక్కువగా అంటగట్టాడు.

శంభులింగం మామగారు (శం.మా) మొదట్లో స్థలాన్ని చూసినప్పుడు ఏమీ అనలేదు. తీరా రిజిస్ట్రేషన్ ఆఫీసుకు వచ్చిన తర్వాత స్టాంప్ కాగితాలు వ్రాసుకొన్న తరువాత "అల్లుడూ" అని గొణిగాడు.

"ఏమిటండి?" అన్నాడు శంభులింగం చిరాగ్గా.

"మనం దక్షిణంవైపు స్థలం కలుపుకొన్నాం కదా!"

"అయితే ఏమిటండి?"

"దక్షిణంలో ఖాళీస్థలం కలుపుకొంటే యజమాని దివాలా తీస్తాడు. కొన్నాళ్లికి ఇంటి యాజమాన్యమే మారిపోతుందిట. నాకు రాత్రి తెలిసింది". శం.మా. చెప్పారు.

"పోతే పోనీయండి" అన్నాడు చిరాగ్గా శంభులింగం.

"అబ్బా... నీకే మన్నా అయితే నా కేమిటి? మా అమ్మాయికి ఇబ్బంది కదా! తను ఏడుస్తుందని నేను ఏడవాలి కదా!" మానవుడు బయటపడ్డాడు.

శంభులింగం బిత్తరపోయాడు.

"మామయ్యగారూ! అన్నీ అయిపోయాయి. ఇక ఆఫీసర్ ఎదుట సంతకాలే..." శంభులింగం బ్రతిమిలాడుకోబోయాడు.

"అయితే అయింది లేవయ్యా! తెలిసి తెలిసి బురద పొడరులా రాసుకొంటామా! దుమ్మును తలంటుకొంటామా? కరెంట్ ఫ్యూజులో వేలు పెడతామా?" పూర్వాశ్రమంలో కవి కాబట్టి సోడా కొట్టారు శం.మా.

బ్రోకరు, స్థలం అమ్మినతను వచ్చిన తర్వాత చేతులు, కాళ్ళు పట్టుకుని ఇరవైవేలు నష్టంతో రిజిస్ట్రేషన్ ఆపు చేయించాడు శంభులింగం.

మరో నెండు నెలల తర్వాత తూర్పు

ఈశాన్యంలో ఖాళీ స్థలాన్ని కాసింత తక్కువ రేటుకే శం.మా. అల్లుడికి కొనిచ్చి "శంభులింగం! ఈ స్థలం వలన గృహస్థుకి ఆరోగ్యం కలుగుతుంది"

## కోల్పోయిన బాల్యం

తొలకరి చినుకులు రాలిన
నేలపై రేగిన మట్టివాసన
కట్టెల పొయ్యి మీద కుండలో
ఉడుకుతున్న అన్నం ఆవిరులు
అమ్మ ప్రేమతో పెట్టిన గోరుముద్దలు
పెరిగినా మరపురాని జ్ఞాపకాలు
మామిడితోపుల్లో
నక్కినక్కి కోసిన కాయలు
కాకి ఎంగిలంటూ కొరుక్కుతింటూ
బాల్యాన్ని బంతిలా ఎగరేసుకుంటూ
నేస్తాలతో ఆడిపాడిన రోజులు
బడిపిల్లలందరం
ఇంటి గంట కొట్టగానే
రెపరెపలాడే సీతాకోక చిలుకల్లా
బిలబిల్లాడుతూ పరుగెత్తే బాల్యం
పొలం గట్ల మీద పరుగులు తీస్తూ
చెఱుకు రసాన్ని ఆస్వాదిస్తూ
చెరువుల్లో ఈతలు కొట్టే చేపల్లా
స్వేచ్ఛా విహంగాల్లా విహరించిన బాల్యం
వెన్నెల కింద పక్క పరచుకొని
తాతయ్య చెప్పే కథలు వింటూ
నిద్రలోకి జారుకొనే బాల్యం
కళ్ళ ముందే కరిగిపోయింది!
వయసు తెచ్చిన పెద్దరికంతో నాన్ననయి
నా బాల్య స్మృతుల్ని వారసత్వంగా
అందించలేనంత ఎత్తుకు ఎదిగాను
కంప్యూటర్లతో కాలక్షేపం చేస్తూ
చాట్‌లతో నేస్తాలను పలకరిస్తూ
కదిలే యంత్రాల్లా కాలంతో పరుగెత్తుతూ
ప్లాస్టిక్ పూల సౌందర్యాన్ని ఆఘ్రాణించే నా బిడ్డలు
బ్రతుకు చట్రంలో బందీ అయిన ఖైదీలు
బాల్యాన్ని కోల్పోయిన అభాగ్యులు

—పాతూరి అన్నపూర్ణ

అన్నారు. "స్థలమిచ్చాను ఇక ఇల్లు కట్టుకో!" అన్న లెవెల్లో ఒక చూపు వేశారు.

"ఇంటిలోని పోరు ఇంతింత కాదయా!" కనుక శంభులింగం అప్పులిచ్చే సంస్థల చుట్టూ, బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణాలు మొదలుపెట్టాడు. గుడిలో కూడా అన్ని ప్రదక్షిణలు చేయలేదు.

ఒక బ్యాంకు వాళ్ళు శంభులింగాన్ని కనికరించి, గ్యారంటీ సంతకాలు కావాలన్నారు.

మళ్ళీ మామగారిని ఆశ్రయించాడు శంభులింగం. "చూడు లింగం! (ఆప్యాయత పెరిగినప్పుడు వారు అలా పిలుస్తుంటారు) గ్యారంటీ సంతకాలు పెట్టడానికి నాకేం అభ్యంతరం లేదు. నీ కంటే నా కెవరున్నారయ్యా! కాకపోతే ఒకవిషయం ఆలోచించు. నువ్వు ఇన్నాళ్ళ నుంచి ఉద్యోగం చేస్తున్నావ్... ఏ ఒక్కరు కూడా నీ ఆఫీసులో నీకు సంతకం పెట్టలేదంటే నీ కెంత అప్రతిష్ఠో ఆలోచించు. ఇంకో రకంగా అనుకోకు. ఎవరూ చేయకపోతే చెప్పు. నాకు తెలిసిన వాళ్ళచేత చేయిస్తాను" శం.మా. ఉపన్యాసం ఇచ్చారు.

పాపం– మెతక శంభులింగం సగం చచ్చాడు.

ఎవరూ గ్యారంటీ సంతకం పెట్టకపోతే చవటసన్నాసిని అవుతాననే భయంతో – మొత్తానికి మిత్రుల సహకారంతో గ్యారంటీ కష్టం గట్టెక్కాడు.

ప్లాన్ అప్రూవల్ అయిన తర్వాత, ఒక సిద్ధాంతి దగ్గర ఇంటి శంఖుస్థాపనకు ముహూర్తం పెట్టించుకున్నాడు శంభులింగం. ముహూర్తం విషయం శం.మా. విన్న తర్వాత పంచాంగం విప్పారు.

"లింగం! ఈ మాత్రం కూడా నీకు తెలియదా! ఎవడయ్యా ఈ ముహూర్తం పెట్టినవాడు...? చైత్ర మాసంలో ఎవడన్నా ఇల్లు కట్టుకుంటాడయ్యా... చైత్రం భయం... జ్యేష్ఠం మృత్యువు... ఆషాఢం సిరిసంపదల స్వాహా, భాద్రపదం రోగ భయం... ఆశ్వయుజం కలహం... మార్గశిరం కష్టాలు... పుష్యంలో చోర, అగ్నిభయాలు.

శంభులింగానికి పెద్దసందేహం వచ్చింది.. "మామయ్య గారూ! ఇల్లు కట్టుకునే నెలే లేదా?"

"ఉందయ్యా... నేను చెబుతాగా... కార్తీక

మాసంలో నేను పెట్టిస్తాగా..” శం.మా. అన్నారు.

పెట్టిస్తాగా అంటే పెట్టి... ఇస్తాడనా.. లేకపోతే ఎవరి చేతనన్నా ముహూర్తం పెట్టిస్తాడనా? ఎందుకొచ్చిన ప్రశ్న అని మౌనంగా ఉన్న అల్లుడి దగ్గరికి మామగారు మరుసటిరోజే ముహూర్తం పెట్టుకొచ్చారు.

“ఇదిగో.. కార్తీక మాసంలో గురువారం నాడు కుంభలగ్నంలో ముహూర్తం పెట్టాను. గోడ మధ్య భాగంలో శంఖు ప్రతిష్ఠాపన చెయ్యాలి. ఇటుకతో కట్టే కొంపకాబట్టి ఇటుకతో శంఖు తయారు చేసి స్థాపించాలి. శంఖు ఎన్ని సంవత్సరాలు భూమిలో ఉంటుందో, అన్ని సంవత్సరాల వరకు ఇంటికి శుభం కలుగుతుంది”.

శంఖు అంటే ఏమిటని అడిగితే ఆ మాత్రం తెలియదా కుంఖ (కుంకకి కొత్తరూపం) అంటాడేమోనని, “ఇహ్హిహ్హిహ్హి అలాగే... అలాగే...” శంభులింగం తల ఊపాడు మామగారి బోధ విన్న తర్వాత.

ఎందుకైనా మంచిదని ఇంటిప్లాను ముందుగానే మామగారికి చూపించబోయాడు.

“లింగం... నిన్ను ప్రతి విషయంలో అనుమానిస్తాననుకొంటున్నావా.. కాకపోతే ఒక విషయం గుర్తుంచుకో... రెండు గర్భాల ఇల్లు కట్టకు... గర్భచ్ఛేదన చేయకు... గర్భం ఎంత ఉంటుందో అంత ఎత్తులో ఇల్లు ఉండాలి. దాని వల్ల మంచి జరుగుతుంది హితబోధ చేశారు శం.మా.

తన సొంత భార్యకి గర్భమనే మాట విన్నప్పుడు ఎంతో సంతోషపడ్డ శంభులింగం, ఇప్పుడు సొంత ఇంటికి గర్భమంటే ఏమిటో తెలియక చాలా ఆందోళన పడ్డాడు.

“ఇంటి మధ్య భాగం నాభీస్థానాన్ని, గర్భమంటారు.

“గర్భం వెడల్పులో అడ్డుగోడలు- పెడితే గర్భచ్ఛేదమంటారు. అయినా ఇలాంటివన్నీ ప్లానులో మంచిగానే చేస్తార్లే....” శం.మా. వివరణ ఇచ్చాడు.

“ఎందుకయినా మంచిది... ఈ గర్భాల గొడవ రాకుండా ఒకసారి ఇంటిప్లాను పూర్తిగా చూడండి...” శంభులింగం మరోసారి బ్రతిమాలాడు మామగారిని చూడమని.

“వద్దన్నాను కదయ్యా... నేను మనుషులకు ఒకసారే చెబుతాను...! శం.మా. మాట దూసుకు వచ్చింది.

పాపం, మెత్తని శంభులింగం బిత్తరపోయాడు. భార్యామణి తన తండ్రిగారి మాట అతి సాధారణమైనదిగా చూస్తోంది.

శంఖుస్థాపన పూర్తయి, ఇల్లుకట్టడం

## మట్టి

ఆకాశం అంచుల్లో మబ్బు కళ్లు
కురిసిన చినుకు ప్రవాహం
మట్టిని తాకి మురిసి మైమరిచింది
నీటి వాసన కరువై
గొంతెండిన వేళ్లు పులకించాయి
నీళ్ల తడలుతడలుగా ఒంటిని రాసుకున్నప్పుడు
నాగలి చాళ్లలో జారిన గింజలు
మొక్కలై పలికాయి ఓ తడిగీతంలో
మట్టికీ, మనిషికీ తెగిపోని సూత్రం
విశ్వ హృదయాలు తిరిగే నేత్రం
అదో పీటముడి మట్టి ఒడిలో
రాతియుగం నుండీ కూడా...
మనిషి మారినా మారొచ్చు
మట్టిలో చలించే మమతలు మారలేదు
మట్టి మాట్లాడిందా!
మానవత్వం పొంగి పొర్లింది కాబోలు
మౌనతరంగాలు ఎగుస్తున్నవేమో! చూడు,
తుంపర్లాటలో చినుకుగా రాలి
నదులై నడిచీ నడిచి
నేలను పుష్కర తానాలాడించింది
నీట మునిగినా మళ్లీ
ఆ నీటికే గర్భక్షేత్రమైంది మట్టి,
మట్టి మహిమ మనిషి కెందుకు లేదో?

– డా॥టి. రాధాకృష్ణమాచార్యులు

ప్రారంభమయింది. వేరే ఊళ్ళో ఉంటున్న శం.మా. ఒక రోజు హఠాత్తుగా అల్లుడు కట్టిస్తున్న ఇల్లు చూద్దామని వచ్చాడు.

"మీరు చెప్పినట్లు గర్భం విషయంలో చాలా జాగ్రత్త తీసుకొన్నానండి. ఎప్పుడూ గర్భచ్ఛేదం చెయ్యవద్దని మేస్త్రికి కూడా చెప్పానండి'' శంభులింగం వినయంగా మామగారికి ఇల్లు చూపిస్తూ అన్నాడు.

"ఊ... ఊ..." అంటూ శం.మా. ఒక చోటికి వచ్చి "ఎంత పనిచేశావ్... ఎంత పని చేశావ్!" సినిమాడైలాగు లెవల్లో రిపీట్ చేశాడు. 'ఇల్లు గట్టి చూడాలయ్యా... గట్టిచూడాలి."

ఏదో ఉరిమి మీద పడబోతోందని శంభులింగం గ్రహించాడు.

"అల్లుడూ... నీ కేమిటి దిక్కు?" శం.మా. అన్నారు.

"నాకు దిక్కేముంది మామయ్యగారు... మీరు.. డబ్బు" శంభులింగం జోకాననుకున్నాడు.

"అల్లుడూ... తూర్పుకి ఉత్తరానికి మధ్య ఉన్న మూలని ఏమంటారు?" శం.మా. తీవ్ర స్వరంతో ప్రశ్నించాడు.

"తూర్పు ఉత్తరపు మూల" - పాపం శంభులింగానికి మూలల నాలెడ్జి లేదు. "తూర్పు ఉత్తరం మధ్య ఉన్న మూలని తూర్పుఉత్తరం మూలఅని, పడమర ఉత్తరం మధ్య మూలని పడమ ఉత్తరం మూలని అంటారు'' కంటిన్యూచేశాడు శంభులింగం.

అంతే.. శం.మా. అగ్నిహోత్రులయ్యారు.

"ఏమిటి అల్లుడూ... మూలలు తెలియని వాడివి ఒక మూల కూర్చోక ఇల్లు కట్టడమేమిటయ్యా... ఎవడయ్యా ఈ ప్లాన్ గీసింది. దేవుడి పూజామందిరం ఈశాన్యములో తూర్పుగోడకు చేర్చి ఉండాలి. తెలుసా నీకు... శం.మా. గర్జించాడు.

"తెలియదు..." శంభులింగం తడుముకుంటూ అన్నాడు. "ఆగ్నేయంలో పూజా మందిరం కట్టిస్తావా... హవ్వ... మన ఇంటా వంటా ఇలాంటివి ఉన్నాయా?

ఇంట్లో సరే... వంటలో పూజా మందిర మేమిటని శంభులింగం అడగాలనుకొన్నాడు. తర్వాత ఆయన ఉపన్యానం వినలేక'' మామయ్యగారూ! కట్టేయడం పూర్తయింది." చిన్నగా సనుగుతూ అన్నాడు.

"అయితే అయిపోతావ్... నువ్వొక్కడివి అయితే సరే... నా కూతురు కూడా ఉందికదా... ఆ మరుగుదొడ్డి కొంచెం ఈశాన్యంవైపు వాలి ఉంది. ఎవడయ్యా కట్టినవాడు... బుద్ధి ఉన్నవాడేనా?"

''ఏమండోయ్! మాటలు జాగ్రత్తగా రానీయండి!' మేస్త్రీ ఎంటరయ్యాడు. అతను శంభులింగం కాదు. పాపం శం.మా.కి అవమానం అయింది. శంభు లింగం సపోర్ట్‌గా మాట్లాడతాడేమోనని చూశాడు.

శంభులింగం మౌనంగా ఉన్నాడు.

"ఏమిటయ్యా మేస్త్రీ ఓవర్ హెడ్‌ట్యాంక్ ఎటు కట్టాలి? నైరుతిలో కట్టాలి. అది చూడు ఈశాన్యంలో పెట్టావు. ఆ సెప్టిక్‌ట్యాంక్ చూడు... ఈశాన్యంలోకి జరుగుతోంది. ఏమిటయ్యా ఇది..."

''ఓవర్... ఓవర్.. హెడ్'' మేస్త్రి విసుక్కొన్నాడు. అతని మాటలలోని ఎగతాళిని అర్థం చేకొని, శంభులింగం వైపు చూసి గబగబా నడిచారు శం.మా. శంభులింగం అనుసరించాడు.

మామగారు భవిష్యత్తులో డబ్బు సర్దుబాటు చేస్తాడు కనుక, చెడు చేసుకోవటం దేనికని "ఏం చేద్దామంటారు మామగారు'' అన్నాడు శంభులింగం.

"నా శ్రాద్ధం చేయి... ముందు నువ్వు ఆ సెప్టిక్ ట్యాంక్, ఓవర్ హెడ్ టాంక్, పూజామందిరం, లెట్రిన్ ఇవన్నీ పడగొట్టించి నేను చెప్పినట్లు చేయి... లేకపోతే మళ్ళీ ఇంట్లో అడుగు పెట్టను'' అని మామగారు విసురుగా వెళ్ళిపోయారు.

ముందే చూసి చెప్పమంటే చెప్పని మామగారిని ఏమీ అనలేక, కట్టించిన దానిని పడగొట్టి మళ్ళీ కట్టిస్తే అయ్యే అదనపు ఖర్చుని అంచనా వేయలేక ఏం చేయాలో తోచక శంభులింగం కట్టించిన ఇంటివైపు దీనంగా చూస్తూ నిలబడ్డాడు- ఈలోకంలో చాలా మందికి లాగానే. ■